# 21. అక్రమ భిన్నం $\frac{17000}{1}$

"దులపర బుల్లోడో, దుమ్ము దులపరబుల్లోడో ..."

అమ్మాయి పాడుతున్నాది. వాళ్ళు 'మా౹వ౹' హార్మనీ వాయిస్తున్నాడు. అమ్మాయి డాన్సు చేస్తున్నది. జనం నిలబడి చూస్తున్నారు. అమ్మాయి వెకిలిగా అభినయమూ అవయవ ప్రదర్శనా చేస్తున్నది. జనం వెర్రి చప్పట్లు కొడుతున్నారు.

ఆ జనంలో శంకరం వొకడు. ఈ ఎగ్జిబిషన్లోకి వీళ్లెలా దూరేరు అనుకున్నాడు శంకరం; దూరంనుంచి అటొస్తూ.

'మామూలుగా అందర్లాగే ఎగ్జిబిషన్ చూడ్డానికని టిక్కట్లు కొనుక్కుని; లోపలి కొచ్చేక ఈ కచేరీ పెట్టి వుంటారు' అని తనకి తనే సమాధానం చెప్పుకున్నాడు.

శంకరం మళ్ళీ మరో మాటు మోచేతులు మొప్పలు చేసి లోపలి నుంచి ఇంకా లోపలికి చొరబడ్డాడు. ఇప్పుడతనికి ఎవరూ అడ్డులేరు.

అక్కడ చేరిన జనంలో చాలా మందికి లాగే శంకరానిక్కూడా ఆ పాటలో అర్థంకంటే, అభినయంలో మెరుపులే బావున్నాయి. శంకరం కళ్ళు ఆ అమ్మాయినోమాటు చూసీగానే జనంమీద పడ్డాయి.

జనం గుంపుగా వోచోట లేరు. గుండ్రంగా సున్నాచుట్టినట్లు నిలబడ్డారు. అంత గుండ్రంగా కొందరు సున్నా చుట్టినట్టు జనాన్ని డ్రిల్లు మేస్టర్లు నిలబెట్టగలరేమో.

సున్నా అవతలి అంచుని నారాయణ కనబడ్డాడు శంకరానికి.

'నాకు తెలుసు, నువ్విక్కడుంటావని!' అనుకున్నాడు శంకరం; ఆ మొదటి చూపులోనే - నారాయణ శంకరాన్ని అంతకు ముందే చూసి నట్టున్నాడు. ఎందుకంటే అతను ఇతనివేపు చూసిన చూపులో కుతూహలపు మెరుపులేదు. కులాసా ప్రశ్నలేదు. జస్ట్ మిస్చివస్ లాఫ్! అ అల్లరికి భాషలేదు. ఉంటే, ఆ చూపుని 'బలేవుందికదూ, గురూ!' అని ట్రాన్స్‌లేట్ చెయ్యాలి.

వాళ్ళిద్దరూ ఆ భాషకంటే గొప్ప వాళ్ళే.

నారాయణకి ఏ.జీ. ఆఫీసులో ఉద్యోగం. శంకరం ఏనిమల్ హజ్బెండ్రీలో -

'నా దగ్గిరకి రా' అని సంజ్ఞ చేసేడు శంకరం.

'లేదు; నా దగ్గిరకే నువ్వురా' అని నారాయణ సంజ్ఞ -

శంకరం పరకాయించి చూసేడు.

నారాయణ నిలబడివున్న దగ్గిర జనం దట్టంగా ఉన్నారు. అక్కడ నేల చదునుగాలేదు. అంచేత జనం గేలరీలాగ నిలబడ్డారు.

అక్కడ నిలబడి చోద్యం చూస్తున్న వాళ్లలో కాలేజీ అమ్మాయిలూ, ఇంకా కొందరు మర్యాదస్తులైన స్త్రీలు -

'సరే నేనే వస్తాన్లే' అన్నట్టు శంకరం నిలువుగా తల ఆడించేడు.

సున్నాపై అంచుమీదినించి నారాయణవేపు వెళ్ళేడు శంకరం.

మళ్ళీ మోచేతులూ నడుములూ -

ఈ డాన్స్ చూడకుండా, ఓసారితొంగిచూసి వెళుతున్నారు జనం. తొంగి చూడ్డంకోసమేనా ఇటొచ్చి మరీ వెళుతున్నారు జనం.

బాగున్నాది.

ఇది మంచి సమయము ... ...

'మీ ఆఫీసు దగ్గిరికి రమ్మన్నావు కదురా?'

'క్యూలో నిలబడ్డాను. ముందుకి తోసేసేరు.'

ఏమిటో, నారాయణ ఉత్సాహంగా లేడు.

అమ్మాయి పాడుతూ డేన్సాడుతూనేవున్నాది. వాళ్ళ మాఁవఁ హార్మనీ వాయిస్తూనే వున్నాడు, జనం చూస్తూనే వున్నారు, వింటూనే వున్నారు.

వినేదంత బావు లేకపోయినా చూసేది బావుంది, అక్కడ చాలా మందికి.

'మాయా మర్మం తెలియని చిన్నది

మంగళగిరి తిరుణాళ్ళకు వెళితే

జనం వొత్తిడికి సతమతమౌతూ

దిక్కు తోచక తికమక పడితే

సందుచూసుకుని సరసాలకు దిగు

గ్రంథసాంగులను, కాపు వేసుకొని

శ్రీమద్ రమారమణ గోవిందాయని ...."

'దీని మొహం!' అనుకున్నాడు శంకరం.

'చూడు, దీని వెర్రి!' అన్నట్టు చూసేడు నారాయణ వేపు.

'ఛా! మనకి బుద్ధిలేదురా!'నారాయణ మూతివిరిచేడు.

'అవునవును! లేదు, పాపం' అని వెక్కిరింపు నవ్వు నవ్వేశాడు శంకరం.

'పోదాంపద!'

'ఉండుండు. నీ స్కోరు పూర్తయిందేమిటి?'

'నన్నొదిలీ ఒరే. నే వెళతాను.'

జబ్బ పట్టుకొని నారాయణని ఆపేడు శంకరం.

'నే నివాళనించీ ఈ వెధవపన్లు చెయ్యను.'

పకపకా నవ్వేడు శంకరం.

' మొన్న సోమవారంనించీ రంకు తనం మానేసేనన్నాదిట, నీలాటిదే ఎవత్తోను.'

రోజూ కలుసుకుంటారు వాళ్ళు.

శంకరం ఆఫీసొదలగానే నారాయణ దగ్గిరి కెళతాడు. అతను ఆఫీసులోలేకపోతే లకిడీకాపూల్ ఎనిమిదో నెంబరు బస్సుస్టాపు దగ్గిరకి.

అక్కడ అతను తప్పకుండా వుంటాడు.

అక్కడ ఇద్దరూ కలిసి క్యూలో జొరపడతారు.

క్యూలో -

శంకరానికి ముందూ నారాయణకి వెనకా, లేకపోతే ఇద్దరికీ మధ్య, ఇద్దరో వొక్కత్తో -వేడిగా వుంటుంది వాళ్ళకి సాయంత్రం.

ఆ 'క్యూ' బస్సులో ఎక్కేసరికి ఆరవుతుంది.

అక్కడ 'ఎనిమిది' ఎక్కి ఆరు న్నరలోగా వాళ్ళు కోఠీ చేరతారు. కోఠీనించి నాలుగడుగులు నడిస్తే సుల్తాన్‌బజార్-

అక్కడ చాలా దుకాణాలున్నాయి.

గాజులకొట్లు, పూసలకొట్లు, కుంకంకొట్లు-

కూరగాయల మార్కెట్టు -

అన్నీ రంగులు, మెత్తని దుర్వాసన.

అంతా మెత్తగా ఒత్తిడి; ఒత్తుగా తొక్కిడి.

(వాళ్ళెవరికీ తెలియదు; అది వేరేసంగతి)

'టైమెంత?'

'ఏడూ యాభై'

'నీ స్కోరెంత?'

'నాది పధ్నాలుగు'

'నాది పన్నెండు'

'నా పధ్నాలుగులో మంచిదొకటీ లేదు.'

'నా పన్నెండింట్లో రెండు పాల గిన్నెలు, రెండు పీటలు'

'వాటేలక్'

తరవాత మాటలు చెప్పడం కష్టం.

✣ ✣ ✣

'వెళ్ళిపోదాం'

'నీ కేదో పిచ్చి పట్టింది'

'పిచ్చికాదు; దెయ్యం పట్టింది; నాకిన్నాళ్లూ,

నా మతిపోయింది. వెధవనై తిరిగేను -'

'ఊఁహూఁ. ఇవాళే బుద్ధొచ్చిందా?'

'ఇంకా రాలేదు. ఈ పాటికి తెలివి తెచ్చుకొని ఇంటికి పోతే బుద్ధొచ్చినట్టే.'

'ఈ ఎగ్జిబిషన్ మనకి వేలకొద్దీ కామధేనువుల్ని ప్రసాదిస్తుందన్నావు కదా!'

'ఇచ్చింది... కాని -'

'వెధవ కానీలూ నువ్వూనూ! స్కోరెంత? ఇరవయ్యో ముప్పయ్యో దాటి వుంటుంది. అందుకే నీపని అలా వుంది."

'ష.ట్ట.....ప్!!'

నారాయణ అరుపుకి శంకరానికి మతొొచ్చినట్టయింది.

'వాట్ బ్రదర్?...... ఏమి టైంది?'

'.............'

'ఎనీథింగ్ రాంగ్?'

"........."

"ఎవత్తేనా పాదుకా పట్టాభిషేకం గట్రా చేసిందేవిటి??.. అయినా మనకీ మాత్రం దానికి కోపాలు తెచ్చుకోడం రాదే! ఇటు తిరిగి నవ్వీసు కుంటామే - ఏమిటిలా వెర్రెత్తిపోతున్నావు?'

✣ ✣ ✣

హ హ్హ హ్హ - పూర్ఫెలో!

పూర్తిగా అప్సెట్టయిపోయి వుంటాడు.

క్యూలో నిలబడి పక్కనున్న అమ్మాయితో సహాబస్సెక్కేట్ట.

తనకోసం నిలబడాలనే అనిపించిందిట కానీ, ఆ అమ్మాయి వాడికోసం నిలబడదు కదా!... జాంపండులా వుందిట - వొదలబుద్ధెయ్యలేదుట -

...... విశేషాలుంటే రేపు కలిసి చెప్పొచ్చుగా ... అలాగే అనుకొని వెళ్ళేడట.

బస్సులో కూడా ప్రెషర్ - అదే, ఒత్తిడి - ఎక్కువగానే వుందిట. నిజం - "మూడు సాయింకాలాలు సుల్తాన్ బజార్లో తిరగడం కంటే ఒక్కమారు రష్షుగావున్న బస్సులో ఎక్కిపోవడం నయం."

వెనక ఈవిడా, ముందుఇంకో ఆవిడా; తగిలేరుట; తగుల్తున్నారుట -

అంతేకాదు మరి. అలాంటప్పుడు 'బస్సు ఆగిననూ దిగరాదు.'

సడెన్ బ్రేక్ ఆసరా చూసుకుని అవతల నించున్న ఆవిడవేపు -

అ అమ్మాయి కంకితమైన ధ్యానం పరధ్యానం కాగా. ఆవిణ్ణి -

చిన్న టచ్ ! - అంతే !

'ఛీ!' అని ఇటు తిరిగిందట ఆవిడ -

పాపం, వాళ్ళావిడే

అదీ, కథ!

కష్టమే -

బస్సులో వాళ్లావిడచేత చివాట్లు తినడం, చుట్టూరా ఇరవై మంది నవ్వడం, యాభైమంది తలలుతిప్పి తనవైపు చూడ్డం -

కాని -

'ఈ మాత్రం దానికేనా?' అని నవ్వేడు శంకరం.

నారాయణ నెత్తి మొత్తుకున్నాడు. ఇంక నీదగ్గిర నిలబడలేనన్నాడు. అతను వెళ్ళిపోతూ వుంటే తనొక్కడూ ఉండిపోలేకా అతన్తో బాటు వెళ్ళిపోలేకా గిలగిల్లాడేడు శంకరం.

'ఏదీ, ఇంకా స్కోర్ అవందే! - పోనీ టైమైనా అవలేదు.'

అతనలా వెళ్ళిపోవడం శంకరానికి ఏమిటోగా వుంది.

ఈ ఎగ్జిబిషన్లో - ఇంతమందిలో తను ఒక్కడే అయిపోయినట్టుంది. ఎంత మందుంటారు - పదివేల మందా? ఇరవై వేలుండొచ్చు. మొన్న బస్సులో ఆ ఎగ్జిక్యూటివ్ ఎవరితోనో చెబుతున్నాడు; పదిహేడు వేల టిక్కెట్లు పోతున్నాయట రోజూ.

పదిహేడు వేలలో తానొక్కడు.

తనకేమీ పనిలేదక్కడ.

అయినా ఎందుకుండాలి?

సాయంత్రం నారాయణ కోసం వస్తూ ఇవాళ ఇరవై అయిదు 'రన్స్' చేస్తాననుకున్నాడు.

వాడు వెళ్ళిపోవడం ఏమిటోగా వుంది.

శంకరం కాళ్ళెటో నడుస్తున్నాయి. కళ్ళేవిటో చూస్తూతాగుతున్నాయి. ఇంకా పూర్తిగా మత్తెక్కలేదు. మెదడు కోరికల్లో కల్లోవుంది.

ఇరవై ఎనిమిదేళ్ళు శంకరానికి.

ఈ ఇరవై ఎనిమిదేళ్ళలో ఆఖరి ఎనిమిదేళ్ళూ నారాయణతో కలిసే తిరుగు తున్నాడు.

'మనకి బుద్ధిలేదురా' అన్నాడు వాడు.

'నాకు బుద్ధిలేదురా' అన్లేదు. ఇద్దర్నీ కలిపే అన్నాడు.

ఎందుకన్నాడు?

అంత షాక్ తినుంటాడా?

- పాపం; వాళ్ళావిడ చాలా మంచిది. తాసీల్దారు కూతురు. వీడు శ్రీరాముడని ఆవిడుద్దేశం, అభిమానం, గౌరవం.

'ఇంకిలాంటి వెధవపని చెయ్యన్రా' అన్నాడు వాడు.

చెయ్యడా?... చెయ్యనే చెయ్యడా?

✣ ✣ ✣

ఎదురుగా కనబడ్డ రంగులవలతో అన్ని సందేహాలూ ఎగిరిపోయాయి.

అబ్బ! ఎంతమందో!

ఏదో అమ్మాయిల కాలేజీ పునాదుల్తో సహా లేచొచ్చింది. ఈ ఎగ్జిబిషన్ చూడ్డానికి - కాదు - ఈ ఎగ్జిబిషన్లో ఎగ్జిబిషన్ కావడానికి - ఈ ఎగ్జిబిషనుకి టిక్కెట్టక్కర్లేకపోవడం ఎంత అదృష్టం!

కొందరిటువేపు తిరిగి చూస్తున్నారు. అందరూ సరదాగా సంతోషంగా వున్నారు. వికవికా విరగబడి నవ్వుకుంటున్నారు. పడుచుతనపు పరువం పరాకుగా పరవశంలో పరిమళిస్తున్నాది.

బాగుంది.

ఇది మంచి సమయం -

చుట్టూ చూసేడు శంకరం.

తన పక్కగా నలుగురైదుగురుఅబ్బాయిలు.

గార్డియన్లుకారు. అందులో ఎవరికీ అన్నలూ తమ్ముళ్ళూ కారు వీళ్ళు.

వాళ్ళచూపుల్లో గడుసుతనం గాని దాపరికంగాని లేకుండా, ఆకలి, వెకిలిగా బైట పడుతున్నాది. అర్భకులు ! -

✣ ✣ ✣

నల్లగాఉందే, ఆ అమ్మాయైతే? ...బెరుదు చూపులుచూస్తోంది. సారీ అనికూడా అనక్కర్లేదు......బాగాలేదు..... ఇందులో ఏ హీరోయిన్కో చెలికత్తెలా గుంది... సరీగా ముస్తాబవడమేనా చేతకాలేదు... నల్లటి మొహంమీద అంగారు బొట్టు పెట్టుకుంది. ...టైలరమ్మాయి దగ్గిర కూడా మొహమాట పడిపోయి లూజ్గా కుట్టించుకుంది. ఆయాసం ఎక్కువా ఆనందం తక్కువా అయిపోతుందేమో -

ఎర్ర జాకెట్టేసుకున్న ఈ అమ్మాయి మాటేమిటి? బావుంది.... ఫైన్, బాగా కుట్టించుకుంది. ఇంకేమీ కనబడ్డంలేదసలు... కాని చూపులు చురుగ్గా వున్నాయి... చెప్పులూ గట్టిగానే వుండుంటాయి.తంతుందేమో -

ఓ సారి డి.పి.ఐ. ఆఫీసుదగ్గిర - ఆ హోంసైన్స్ కాలేజీ అమ్మాయి ఇలాగే -

చురకత్తిలా ఉందిరా అనుకున్నాడు తను. కడుపులో పిడికిటితో పొడిచింది బాక్సర్లాగ. కత్తేన్రా బాబూ అనిపించుకున్నాది. నారాయణగాడి కేనా చెప్పలేదు తను.

ఈ అమ్మాయి...?

పద్దెనిమిదేళ్ళుంటాయి. బాగా విచ్చుకున్న పువ్వులూ లేత లేత కూరగాయలూ జ్ఞాపకం వస్తున్నాయి. ఎక్కడా ఏమీ తగల్లేదు; కనల్లేదు; కమల్లేదు! మేనత్తకొడుకేనా ఎవడూ లేడు కాబోలు. మేన మామలైనా యెప్పుడూ బుగ్గలు గిల్లలేదులా వుంది. తడిగుడ్డెట్టి తుడిచిన బెంగుళూరు యాపిల్సులా వున్నాయి... ఇందాకటి అమ్మాయికి హీరోయిన్లా వుంది.

బాగానే వుంటుంది.

స్కోర్లో వేసుకుంటే ఇలాంటి వాళ్ళని వేసుకోవాలి.

ఒకటీ ఈజీక్వల్టూ మూడు.

కాలేజీ అమ్మాయిలు ఇనపసామాన్ల కొట్టుదగ్గిర ఆగేరు ఎందుకో?....

సరదాల సరస్వతులు చట్రాములూ, కోరాములూ, కత్తిపీటలూ, అట్లకర్రలూ చూస్తున్నారు.

గులాబీలు ఇనుమూ! ... ... ఫూల్ ఔర్ పత్థర్ - ।

ఆడపిల్లలకి కాఠిన్యం యిష్టం కాబోలు. మెత్తగా ఆడదాన్లా సున్నగా వుండే మొగాడు అడదానికి నచ్చట్ట...

వెనక్కొస్తున్నారు.

ఈ అబ్బాయిలు-వీళ్ళు నలుగురల్లా పదహారుగురయ్యేరు. ఎక్కణ్ణించొచ్చారో-!

వీళ్ళంతా మన శిష్యుల్లా వున్నారు. మే యువర్ ట్రైబ్ ఇన్ క్రీజ్ !

✣ ✣ ✣

అందరూ అందర్నీ మోహరంలో పదాతిబలంలా ఎదుర్కొన్నారు...దారిలేదు... అంతా గడబిడ.

చీలికలయిపోయింది గుంపు.

ఇద్దరేసి, ముగ్గురేసి గొలుసులైపోయేరు, విడ్డారు అమ్మాయిలు.

ఎవరూ ఏమీ అనరు -

ఎర్రజాకెట్టమ్మాయి - ఇంత సేపూ గడుసుగానే చూసిందిగాని -పూర్‌సోల్ - ఒక్కత్తయి పోయింది పాపం -

ఇప్పుడు పాపఁవేఁవిఁటి; నాన్ సెన్స్!

✣ ✣ ✣

పదిహేడుగురు మొగాళ్ళూ ఒక ఆడపిల్లా.

అవునవును; పదిహేడు వేలమంది జనం, ఒక్క ఆడపిల్లా

ఎర్రజాకెట్టమ్మాయి పేరేమిటో గాని, పాపం అభిమన్యుల్లా చిక్కడిపోయింది. అభిమన్యుళ్ళా తప్పించుకోవలసిందే గాబోలు. నిశ్శబ్దంగా జరుగుతున్న ఈ అన్యాయానికి సాక్షుల్లేరు ముద్దాయిలు తప్ప.

ఇది వీళ్లంతా కావాలని చేస్తున్నారని కొందరికేనా తెలుసునా?

అడిగేవార్లేరా?

ఈ పద్ధతే వేరసలు -

కొద్దిగా తగల్డం.

చురుగ్గా చూడకపోతే వెకిలిగా నవ్వుకోడం.

చురుగ్గా చూస్తే 'సారీ మేడమ్' ... 'ఏయ్ మిష్టర్' అంటేచాలు పలాయనం.

లెంపకాయదాకా వొచ్చిందంటే వాడు మరీ చవటైవుండాలి.

**"అంంంమ్మ్మొ్మ!"**

భూమో, ఆ కాశమో బద్దలైపోయినంత అరుపు అది.

మనం అందరం ఒక్క కాన్పులో పుడితే మన అమ్మ ప్రసవవేదనలో అరిచే అరుపు అది. మన చెల్లెళ్లందరికీ ఒక్కసారే మానభంగం సంభవించినప్పుడో, మన చెల్లెళ్ళందరి మాంగళ్యాలూ ఒక్కసారిగా పుటుక్కున తెగిపోయినప్పుడో, వాళ్ళందరి అరుపులోకి వచ్చేఒక్క శబ్దం అది!

ఆ అమ్మాయి -

ఆ ఎర్రజాకెట్టమ్మాయి ఒక్కత్తీ అరిచిన అరుపు - అది...

పదిహేడువేల మందున్న ఎగ్జిబిషన్ జనంలో, ఒక్కరు - ఒక్కరేనా తనని ఈ అత్యాచారం నించి రక్షించే సోదర దైవం లేడా అని నిస్సహాయంగా చేసిన ఆక్రందన -

అలా అరిచి,

కాళ్ళూ చేతులూ అగ్గిపుల్లల్లాగాముడిచేసుకొని మనిషంతా అగ్గి పెట్టి అంత అయిపోయి ముడుచుకుపోయింది. ముడుచుకొని నేలమీద గొంతికిల్లా కూచుండి పోయింది. నేలతల్లీ నువ్వేనా నన్ను కాపాడు - అనుకొని వుంటుంది.

ఆమె చూపులో బెదురు చెప్పడానికి కవులందరూ సృష్టించిన లేళ్ళు ఎన్నైనా చాలవు!

✤ ✤ ✤

అప్పుడెప్పుడో వసుదేవుడికి యమునానది దారి ఇచ్చిందని వ్రాసేరు భాగవతంలో. ఔనో కాదో గాని -

పదిహేడు మంది మగాళ్లు ఒక ఆడపిల్లకి దారి ఇవ్వడానికి రెండు పాయలుగా చీలారు; ఆ అమ్మాయి వెళిపోతే అంతే చాలునని.

❋

*('జ్యోతి' మాస పత్రిక : ఏప్రిల్ 1968)*